మోడల్ గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి

- గంపలగూడెం మండలంలో ఆరు గ్రామాల్లో సర్వే
- 8,935 హద్దు రాళ్ల ఏర్పాటు


గంపలగూడెంలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్)

గంపలగూడెం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భూవివాదాల శాశ్వత పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్షలో భాగంగా మొదటి విడత భూరీసర్వేలో మండలంలో మోడల్ గ్రామాలుగా ఎంపికైన ఆరు గ్రామాల్లో భూ రీసర్వేను రెవెన్యూ అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. ఫేజ్–1లో జిల్లా వ్యాప్తంగా ఎంపికైన 14 గ్రామాల్లో గంపలగూడెం మండలంలో కనుమూరు, అనుముల్లంక, వినగడప, గంపలగూడెం, చెన్నవరం, రాజవరం గ్రామాలను ఉన్నతాధికారులు ఎంపిక చేసి, గత ఏడాది రీసర్వేను చేపట్టారు. ఆయా గ్రామాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన సర్వే రెవెన్యూ సిబ్బందికి అనేక సమస్యలు ఎదురైనప్పటికీ పాఠాలు నేర్చుకుంటూ సర్వేను విజయవంతంగా పూర్తిచేశారు. దీర్ఘకాలం తర్వాత చేపట్టిన సర్వే అనేక సమస్యలకు పరిష్కారం లభించిందని రైతులు తమ అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి పర్యవేక్షణలో ఆర్ఐ, మండల సర్వేయర్, గ్రామ సచివాలయాల సర్వేయర్లు సర్వేలో ప్రధాన పాత్ర పోషించారు.

ఆరు గ్రామాల్లో సర్వే వివరాలు

గంపలగూడెం మండలంలోని ఆరు రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి కావడంతో ఆయా గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భూముల వివరాలను అధికారులు వెల్లడించారు. కనుమూరులో పట్టాభూమి 3,381.08 ఎకరాలు, ప్రభుత్వ భూమి 456.87ఎకరాలు, అనుముల్లంకలో పట్టాభూమి 1,832.15 ఎకరాలు, ప్రభుత్వ భూమి 324.85 ఎకరాలు, వినగడపలో పట్టాభూమి 2,459.59 ఎకరాలు, ప్రభుత్వ భూమి 796.81ఎకరాలు, గంపలగూడెంలో పట్టాభూమి 2,120 ఎకరాలు, ప్రభుత్వ భూమి 478 ఎకరాలు, చెన్నవరంలో పట్టాభూమి 869.98 ఎకరాలు, ప్రభుత్వ భూమి 179.81 ఎకరాలు, రాజవరంలో పట్టాభూమి 730.48 ఎకరాలు, ప్రభుత్వ భూమి 82.48 ఎకరాలుగా లెక్కకు వచ్చింది. ఆయా గ్రామాల్లో పట్టా, ప్రభుత్వ భూములకు 8,935 సరిహద్దు రాళ్లను పాతించారు.

భూహక్కు పత్రాల పంపిణీ

మండలంలోని ఆరు గ్రామాల్లో సర్వేకు సంబంధించి రైతులకు భూహక్కు పత్రాల పంపిణీ కూడా పూర్తిగా చేపట్టారు. రాజవరంలో 324 పుస్తకాలకుగాను 288, చెన్నవరంలో 393 పుస్తకాలకు గాను 306, గంపలగూడెంలో 880 పుస్తకాలకు గాను 738 పుస్తకాలు, వినగడపలో 1,277 పుస్తకాలకు గాను 1,119, అనుముల్లంకలో 631పుస్తకాలకు గాను 600, కనుమూరులో 1,366 పుస్తకాలకుగాను 1,197 పుస్తకాలను రైతులకు అందజేసినట్లు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తెలిపారు.

సర్వేతో ఎంతో ప్రయోజనం



జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షలో భాగంగా చేపట్టిన భూ రీసర్వేతో రైతులకు ఎంతో ప్రయోజనం ఉంది. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలు శాశ్వత పరిషారానికి నోచుకుంటున్నాయి. రైతుకు ఉచితంగా భూహక్కు పత్రాలతో పాటు భూమికి సరిహద్దు రాళ్లను కూడా ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుంది. ప్రభుత్వ భూమి కూడా పూర్తిగా స్వాధీనంలోకి వస్తుంది.

– తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, గంపలగూడెం

క్లుప్తంగా

వెల్ఫేర్ అండ్ సెక్యూరిటీ రైట్స్ చైర్మన్‌గా ప్రతాప్

మైలవరం: మైలవరం మండలం తోలుకోడు గ్రామానికి చెందిన బుర్రి ప్రతాప్ నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ క్రైమ్ కౌన్సిల్, ఇండియా, సోషల్ వెల్ఫేర్ అండ్ సెక్యూరిటీ రైట్స్ రాష్ట్ర చైర్మన్‌గా నియమితులయ్యారు. దళిత జేఏసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, క్రిస్టియన్ మైనార్టీ మైలవరం నియోజకవర్గ అధ్యక్షుడిగా, ఎన్టీఆర్ జిల్లా మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ తదితర బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు బుర్రి ప్రతాప్‌ను అభినందించారు.

మజ్జిగ పంపిణీ



నూజివీడు: పట్టణంలోని రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండు వద్ద ఆదివారం మజ్జిగను పంపిణీ చేశారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు దాదాపు 1200 మందికి మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు మలిశెట్టి శ్రీనివాస్, సభ్యులు త్రివిధ శ్రీనివాస్, పైడి అనిల్, ముఖర్జీ, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీస్సులు

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ వాహెద్ తన కుమార్తె నజ్మా వివాహం స్థానిక ఎంవీఆర్ కల్యాణ మండపంలో ఆదివారం వైభవంగా జరిపించారు. వివాహ వేడుకల్లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ రుహుల్లా, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎంపీపీ పాలడుగు జోత్స్న, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

నేడు సొసైటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

మైలవరం: మండలంలోని పుల్లూరు గ్రామం పీఏసీఎస్ భవన నిర్మాణానికి సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జీ వెంకట్రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తన్నీరు నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. అనంతరం మొర్సుమల్లి సొసైటీ పరిధిలో గోదామును ప్రారంభిస్తారని తెలిపారు.

ఘనంగా అంకమ్మ తల్లి కొలుపు



రెడ్డిగూడెం: రెడ్డిగూడెంలోని కాపుల బజారున ఉన్న అంకమ్మ తల్లి అమ్మవారి కొలుపు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

హెచ్ఐవీని సమాజం నుంచి పారదోలాలి



నూజివీడు: హెచ్ఐవీ మహమ్మారి నియంత్రణకు సమాజంలోని ప్రతిఒక్కరూ కృషి చేయాలని స్నేహారైడ్స్ సంస్థ చైర్మన్ బసవరాజు నగేష్ అన్నారు. స్నేహారైడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పట్టణంలోని రాజీవ్ సర్కిల్ వద్ద అంతర్జాతీయ క్యాండిల్ లైట్ సంస్మరణ దినం సందర్భంగా విద్యార్థులతో కలసి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నగేష్ మాట్లాడుతూ హెచ్ఐవీని సమాజం నుంచి పారదోలాలన్నారు. హెచ్ఐవీతో బాధపడే వారిని ఆదరించాలన్నారు. ఇది అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి కాబట్టి ఒకరి నుంచి ఒకరికి వస్తుందేమోనని సందేహించాల్సిన అవసరం లేదన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని గేదె మృతి

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి నుంచి చొప్పరమెట్ల వెళ్లే రోడ్డులో ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్ వద్ద ఆదివారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో గేదె మృతి చెందింది. గేదె మృతదేహం రోడ్డుపైనే ఉండటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు.

గ్రంథాలయాల్లో వేసవి ఉచిత శిక్షణ


నూజివీడులోని గ్రంథాలయంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులు

నూజివీడు: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ఆదివారం 14వ రోజుకు చేరింది. ఉదయం 8.30 గంటల నుంచి విద్యార్థులతో నీతికథలు, పొడుపు కథలు, సామెతల పుస్తకాలను చదివించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు సామెతల గురించి విద్యార్థులకు వివరించారు.

గొల్లపల్లిలో..

మండలంలోని గొల్లపల్లిలోని గ్రంథాలయంలో ఆదివారం సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించారు. స్థానిక హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు కే మోహన్‌రావు భాష ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయాధికారి డొక్కు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గణితం అవసరాన్ని గుర్తించాలి

ముసునూరు: నిత్య జీవితంలో గణితం ఆవశ్యకతను గుర్తించాలని గణిత ఉపాధ్యాయుడు సుబ్బారావు సూచించారు. గోపవరం గ్రంథాలయంలో బ్రాంచి అధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆదివారం ప్రామాణిక, లాజికల్ గణితం ప్రాధాన్యాన్ని చిన్నారులకు వివరించారు. అనంతరం చిన్నారులకు చదరంగం, క్యారమ్స్, పరమ పద సోపానం తదితర ఇండోర్ గేమ్స్ నిర్వహించారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను స్పందనలో అందజేస్తే వాటిని గడువులోగా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

ఎ.కొండూరులో..

ఎ.కొండూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఈ స్పందనలో మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొంటారని పేర్కొన్నారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే కార్యక్రమంలో మండలంలోని వివిధశాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

కొల్లి పోరాట పంథా అనుసరణీయం


గుడిపాడులో కొల్లి నాగేశ్వరరావు సంస్మరణ సభ

ముసునూరు: భూపోరాటాల వీరుడుగా జాతీయ ఖ్యాతినార్జించిన కొల్లి పోరాట పంథా నేటి యువతకు అనుసరణీయమైనదని సీపీఐ రాష్ట్ర నాయకుడు చలసాని వెంకట రామారావు అన్నారు. పార్టీ జాతీయ మాజీ కార్యదర్శి, పలు భూపోరాటాల మార్గదర్శి దివంగత కొల్లి నాగేశ్వరరావు వర్ధంతి కార్యక్రమాన్ని ఆయన స్వగ్రామం ముసునూరు మండలం గుడిపాడులో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముందుగా గ్రంథాలయం వద్ద పార్టీ పతాకాన్ని ఎగురవేసి, కొల్లి చిత్రపటానికి, రైతు బంధువు ఏటికాలువ పంతులు పాటిబండ్ల శ్రీరామయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చలసాని మాట్లాడుతూ 70వ దశకంలో నూజివీడు తదితర ప్రాంతాల్లో అనేక భూపోరాటాలు చేసి పేదలకు భూములు పంచిన ఘనుడు కొల్లి అన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినదించి ఆరేళ్లపాటు జైలు శిక్ష అనుభవించారన్నారు. తన యావదాస్తిని పార్టీకే విరాళంగా ఇచ్చిన త్యాగధనుడని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా రైతు నాయకుడు రాయంకుల లక్ష్మణరావు, స్థానిక నేతలు కొల్లి గంగ సత్యనారాయణ, కూచిపూడి నాగేశ్వరరావు, గద్దె రఘు, మండలపు రాధాకృష్ణ, చాట్ల పుల్లారావు పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: రైతాంగ సమస్యలపై పోరాడిన కమ్యూనిస్టు నేత కొల్లి నాగేశ్వరరావు వర్ధంతిని తిరువూరు సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. రైతులు ఎదుర్కొనే ఇబ్బందులను పరిష్కరించేందుకు, పేదలకు భూపంపిణీకి పోరాటాలు చేసిన కొల్లి నేటి తరం నాయకులకు ఆదర్శంగా నిలుస్తారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్ మీరా అన్నారు. పార్టీ పట్టణ కార్యదర్శి ఉదయ్, నాయకులు కొల్లి చిత్రపటానికి నివాళులర్పించారు.

సాంకేతిక విప్లవానికి ఆద్యుడు రాజీవ్‌గాంధీ


నూజివీడులో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నూజివీడు: దేశంలో నేడు నెలకొన్న సాంకేతిక విప్లవానికి ఆద్యుడు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీయేనని కాంగ్రెస్ పార్టీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జి బీడీ రవికుమార్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతిని నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పరిమి సాగర్‌కుమార్, పాలడుగు నాగభరత్, విశల్ కుమార్, పల్లెపాం ప్రసాద్, సూర్యదేవర ప్రసాద్, రాంసింగ్, రవికిషోర్ పాల్గొన్నారు.

కొండపల్లిలో..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతి కార్యక్రమం కొండపల్లిలో ఆదివారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. మూలపాడు గ్రామంలో రాజీవ్ విగ్రహానికి డీసీసీ కార్యదర్శి చింతపల్లి దాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మైలవరంలో..

మైలవరం: ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు చేసిన ఘనత రాజీవ్ గాంధీదేనని ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ తెలిపారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని మైలవరంలో ఆదివారం నిర్వహించారు.

అంకమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు



ఆగిరిపల్లి: మండలంలోని చిన్న ఆగిరిపల్లిలో పామర్తి వారి అంకమ్మతల్లి దేవరను నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పామర్తి శ్రీనివాసరావు అంకమ్మతల్లి మొక్కుబడులు కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, గ్రామ సర్పంచ్ పల్లగాని రమాదేవి జమదగ్ని, చిన్ని రాంబాబు పాల్గొన్నారు.

గోశాల నిర్మాణానికి రూ.25వేల వితరణ

నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీవేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో గోశాల నిర్మాణానికి ఒక భక్తురాలు ఆదివారం రూ.25వేలు వితరణగా ఇచ్చారు. నందిగామకు చెందిన తాళ్లూరి మణివర్ధిని ఈమొత్తాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కే శశిరేఖకు అందజేశారు. దాతను ఆలయ ప్రధాన అర్చకులు ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దర్శనానికి విచ్చేసిన భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు.

ఆలయ ప్రాంగణంలో దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాలను ఆదివారం ఆయన పరిశీలించారు. మహా మండపం రెండో అంతస్తులో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానం, అమ్మవారి దర్శనానికి భక్తులు వేచి ఉన్న క్యూలైన్లను పరిశీలించారు. దేవస్థానం కల్పిస్తున్న సదుపాయాలను భక్తులను అడిగి తెలుసుకున్నారు. అన్నప్రసాదం స్వీకరించేందుకు విచ్చేసిన భక్తుల పట్ల సిబ్బంది మర్యాద పూర్వకంగా వ్యవహరించడంతో పాటు వారికి సంతృప్తికరంగా అన్నప్రసాదం అందించాలని సూచించారు. క్యూలైన్లు కూలర్లు, ఫ్యాన్లు తిరుగుతున్నాయా లేదా అని పరిశీలించడంతో పాటు క్యూలైన్‌లో ఏర్పాటు చేసిన మంచినీటి సదుపాయంతో పాటు ఆలయ పరిసరాల్లో మరిన్ని చోట్ల భక్తులకు మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

విశ్వబ్రాహ్మణులకు అండగా జగనన్న ప్రభుత్వం


పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న చైర్మన్ తోలేటి శ్రీకాంత్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విశ్వబ్రాహ్మణులకు జగనన్న ప్రభుత్వం అండగా ఉంటుందని ఏపీ విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ పేర్కొన్నారు. విశ్వకర్మ ఫౌండేషన్, సేవా ట్రస్ట్ అలయన్స్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఆదివారం చిట్టినగర్ విశ్వ బ్రహ్మణ కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం, వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తోలేటి శ్రీకాంత్ తొలుత విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. విశ్వకర్మ ఫౌండేషన్, సేవా ట్రస్ట్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం, వివాహ పరిచయ వేదికను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో అనేక మంది లబ్ధి పొందుతున్నారని, అన్ని వర్గాలకు వైఎస్ జగన్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా ఫౌండేషన్ అధ్యక్షుడు గోల్తి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి సేవలు పొందారు. సేవా కార్యక్రమాలను సంఘం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు కొత్తపల్లి సత్యనారాయణ, మంగేష్, బంగారయ్య, గోవిందరాజులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించటం అందరి బాధ్యత

మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులను ఆదరించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని సెంట్రల్ జోన్ ఏసీపీ బి.భాస్కరరావు అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన దాత కాంతీలాల్ జైన్, మదన్‌లాల్ జైన్ సహకారంతో వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ.. 70 ఏళ్ల దాటిన వయోవృద్ధులకు ప్రతి నెలా నిత్యావసర సరుకులతో పాటు ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు అందజేయటం అభినందనీయమన్నారు. 191 నెలలుగా వయోవృద్ధులకు సేవలు అందించటం సామాన్యమైన విషయం కాదన్నారు. ట్రస్ట్‌కు అవసరమైన సహాయ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. 53వ డివిజన్ కార్పొరేటర్ మహదేవ్ అప్పాజీరావు మాట్లాడుతూ.. ఇంత మంచి సేవా కార్యక్రమంలో తాను పాల్గొనే అవకాశం లభించటం ఆనందంగా ఉందన్నారు. వృద్ధులకు ప్రతి ఆదివారం ప్రముఖ ఆయుర్వేదం, అల్లోపతి, హోమియో వైద్యనిపుణులచే ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేయటం అభినందనీయమన్నారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ మాట్లాడుతూ తాము చేస్తున్న సేవలకు దాతలు ట్రస్ట్ సభ్యులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. అనంతరం దాతలను సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టీ తట్టి అర్జునరావు, పి.రూపవతి, కె మధుసూదనరావు, వెంకటేష్ గోదావరి పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

మైలవరం: మైలవరం పరిధిలో ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒక వ్యక్తి మృతిచెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో బస్సును ఓవర్‌టేక్ చేయబోయి రెండు మోటారు సైకిళ్లు ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని 108లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తి జీ.కొండూరు మండలం కుంటముక్కలవాసి నరసింహారావు(26)గా గుర్తించారు. అదేవిధంగా మండలంలోని వెల్వడం సచివాలయం సమీపంలో రెండు మోటార్ సైకిళ్లు ఢీకొని ఇరువురు వ్యక్తులు గాయపడ్డారు.

తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తి

రూ.3.63 కోట్లతో పాతరావిచర్ల నుంచి మొర్సపూడి వరకు రోడ్డు నిర్మాణం


నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న పాతరావిచర్ల నుంచి వట్టిగుడిపాడు మీదుగా మొర్సపూడి వెళ్లే తారు రోడ్డు

నూజివీడు: మండలంలోని పాతరావిచర్ల నుంచి వట్టిగుడిపాడు, రామన్నగూడెం మీదుగా మొర్సపూడి వరకు దాదాపు ఏడు కిలోమీటర్ల పొడవునా తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషితో పీఎంజీఎస్‌వై కింద రూ.3.63 కోట్లు మంజూరు కాగా ఆ నిధులతో తారు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. రెండు దశాబ్దాలుగా ఈ రహదారిని నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నప్పటికీ గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు పంపించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు. దీంతో పంచాయతీరాజ్ అధికారులు రోడ్డు నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నారు. లింకు రోడ్ల నిర్మాణం వల్ల గ్రామాలు సైతం అభివృద్ధి పథంలో పయనించనున్నాయి.

వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు మార్గం సుగమం

ఈ రహదారి నిర్మాణం వల్ల ఈ మార్గంలో ఉన్న వందలాది ఎకరాల వ్యవసాయ భూముల్లోకి రైతులు రాకపోకలు సాగించడానికే కాకుండా వ్యవసాయ ఉత్పత్తులను సులువుగా తెచ్చుకునేందుకు మార్గం సుమగమైంది. పాతరావిచర్ల, రావిచర్ల, వట్టిగుడిపాడు, రామన్నగూడెం, మొర్సపూడి గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములు ఈ మార్గంలోనే ఉన్నాయి. మామిడి, మొక్కజొన్న, పత్తి, కూరగాయలు ఇతర వ్యవసాయ, ఉద్యాన పంటల దిగుబడులను రైతులు ఇళ్లకు చేర్చుకోవడానికి ఇబ్బందులు ఉండవు. అంతేగాకుండా ఈ రోడ్డు నిర్మాణం వల్ల రాబోయే రోజుల్లో వ్యవసాయ భూముల ధరలు కూడా పెరుగుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దూరాభారం సైతం తగ్గుతుంది

ఈ రోడ్డు నిర్మాణం వల్ల మొర్సపూడి వైపు నుంచి వట్టిగుడిపాడు, ఆగిరిపల్లి, ఈదులగూడెం వెళ్లేందుకు దూరం తగ్గనుంది. పాతరావిచర్ల వైపు నుంచి వట్టిగుడిపాడు, మల్లవల్లి, హనుమాన్‌జంక్షన్, ఈదులగూడెం తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే దూరాభారం తగ్గడంతో సమయం కలిసి రావడంతో పాటు డబ్బులు ఆదా అవుతాయి. అంతేగాకుండా నూజివీడు పట్టణంలోకి రాకుండానే వెళ్లవచ్చు. దీంతో పట్టణంలో కూడా ట్రాఫిక్ తగ్గుతుంది. అత్యవసర సమయాల్లో ఈ రోడ్డు ద్వారా ట్రాఫిక్‌ను విజయవాడ వైపునకు మళ్లించవచ్చు.

ఎమ్మెల్యే మేకాప్రతాప్ వల్లే సాధ్యం



పాతరావిచర్ల, వట్టిగుడిపాడు మధ్య తారు రోడ్డు నిర్మాణం ఈ ప్రాంత ప్రజలకు వరం. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషి వల్లనే ఈ రోడ్డు నిర్మాణం సాధ్యమైంది. మామిడి కాయలను, ఇతర పంటల ఉత్పత్తులను తోటల్లో నుంచి తెచ్చుకునేందుకు ఎంతో సులువవుతుంది. పాతరావిచర్ల, వట్టిగుడిపాడు, మొర్సపూడి గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు కృషిని ఎన్నటికీ మరిచిపోరు.

– బెజవాడ సత్యనారాయణ, ఉప సర్పంచ్, పాతరావిచర్ల, నూజివీడు మండలం